# ఎడారిబ్రతుకు

[కథానిక]

శ్రీ నందివాడ పుతలీబాయి

నా జీవితం తలచుకొంటే నాకే అసహ్యం వేస్తుంది. ఆలోచించినప్పుడల్లా యిలాంటి జన్మ ఎందుకు ఎత్తానా అని బాధపడ్తాను. అసలు యిలాంటివాళ్లని ఎందుకు పుట్టిస్తాడో దేవుడు! నాలాంటిదురదృష్టవంతు డింకొక డీప్రపంచంలో ఉండడేమో! ఉండద్దు కూడాను. పగవాడికేనా వద్దు నాలాంటి జన్మ.

మానవుడు ప్రతివాడికీ కొద్దో గొప్పో చీకూ చింతా ఉంటుందికాని నాలాగ అసలు సంతోషించ దగ్గ విషయమే ఉండకుండాపోదు. ఏదో ఒకటి చూసి సంతోషిస్తాడు — గర్విస్తాడు. తాను జీవితంలో ఏదో మహత్కార్యం సాధిస్తాననే ధీమాతో — ఆశతో బ్రతుకుతాడు. నా కది లేదు. మనస్సుకా — శాంతి లేదు. దేహారోగ్యమా — అది అసలే లేదు. మరి ఎందుకు బ్రతుకుతున్నానో నాకే అర్థంకాదు.

మాఅమ్మ కాపరానికి వచ్చిన పదిహేనేళ్లకు నేను పుట్టాను. ఈ నాకోసం మా అమ్మ ఎన్ని నోములు నోచిందో, ఎన్ని దేవుళ్లకు మొక్కిందో లెక్కలేదు. వాటన్నిటి ఫలమే నేను. కృష్ణాష్టమినాడు రోహిణీ నక్షత్రయుక్తలగ్నమందు నేను భూమ్మీద పడ్డాను. మేనమామను సాగనంపాను. పిడుగులాంటి మనిషి — నల్లరాయిలాంటివాడు — నడివయస్సులో పోయాడు. అందరూ నాజన్మఫలితం అన్నారు. అందుకే నేను పుట్టానన్న సంతోషం మా అమ్మకు లేదు. సరిగ్గా అదే పాదం అదే నక్షత్రం అయినందుకు మేనమామను సాగనంపగల్గానుకాని ఆ కృష్ణునికున్న అదృష్టం, సంతోషం నాకు లేదు. నేను పుట్టిన ఏడాదిలోనే క్రొత్తగా కొన్న కపిలగోవు పురుగు కుట్టి చచ్చిపోయింది. కొండా మనకున్న నాళ్ళైనా అది మాయింట్లో ఉండలేదు. నాపుట్టుకతోనే ఆరంభమైంది మాఅమ్మకు జబ్బు. అందుకనే మా అమ్మ నన్ను 'నష్టజాతకంవెధవ' అని తిట్టేది. ఇంటిల్లిపాదికీ — ఒక్క మాబామ్మకుతప్ప, అందరికీ — నామీద అదే అభిప్రాయం. ఎవరేమన్నా ఆవిడ నన్ను వెనకేసుకొచ్చేది.

నేనంటే ప్రాణం ఆవిడకు. నాకు పెట్టకుండా ఎప్పుడూ ఫలహారం చేసేదికాదామె. మాతాతపేరు లెండి నాది. నాతోబాటు ఆవిడకూడా బ్రతికిఉంటే నా కిన్నిపాట్లుండేవి కావేమో! ఏదేనా పగల కొట్టినా, అల్లరిచేసినా మాఅమ్మ బుగ్గలు గిల్లేది. కొట్టే ఆవిడకు చేతులు నొప్పెట్టాయని ఎప్పుడూ గిల్లేది. లేకపోతే నెత్తి చిల్లుపడేలాగ మొట్టేది. పాపం, మా బామ్మ ఎక్కడున్నా యిట్టే వచ్చి మాఅమ్మదగ్గిరించి నన్ను పక్కకు లాగి "ఎందుకే అంత అక్కసు! పిల్లాడు చేయకపోతే నువ్వా నేనా చేస్తామా అల్లరి! అదే అందం. యింకెన్నాళ్లు చేస్తాడు వాడుమాత్రం! పెద్దవాడయిపోతున్నాడుకదా!" అనేది.

మా అమ్మ "వెధవ, నష్టజాతకంవెధవ! వాడు పెద్దవాడవడం ఒకేసారి. తెలుస్తోనే ఉంది ఎంత అదృష్టవంతుడో. మేనమామను పొట్టనపెట్టుకున్నాడు. పూటకు కుంచెడుపాలిచ్చే ఆవు అయ్యగారు కాలెట్టగానే పోయింది. సుడివెధవ" అని తిట్టేది.

ఐదో ఏడు రాగానే అక్షరాభ్యాసం చేశారు నాకు. పలకదగ్గర పట్టుమని పదినిమిషాలైనా కూర్చునే వాణ్ణి కాదు. ఎక్కడికి పోతానో అని మాఅమ్మ నన్ను వంటింట్లో కూర్చోపెట్టి తను పనిచేసుకొంటూ నాచేత అక్షరాలు దిద్దించేది. ఎలాగో తంటాలు పడగా పడగా పుస్తకం చదవడం వచ్చింది నాకు. ఆఏడే నాకు తమ్ముడు పుట్టాడు. ఇదివరకుకన్నా పని ఎక్కువవడం, ఒంట్లో కులాసా లేకపోవడంవల్ల మా అమ్మ నా చదువుసంగతిలో మునుపటంత శ్రద్ధ తీసుకోలేకపోయింది. కాని చదువుకోకుండా పాడై పోతున్నాననీ, చిల్లిగవ్వకేనా చెల్లకుండా తయారవుతానేమోననీ మాఅమ్మ బెంగపెట్టుకుంది. మాఅమ్మకు నేను జడ్జీనవాలని కోరిక.

మా బాబాయికి పిల్లలంటే ఎంతో సరదా. తన తర్వాత మళ్లీ యింట్లో పసిపిల్లాడు ఇరవైఏళ్లకు మసిలాడు. మాఅమ్మ కాపరానికి వచ్చినప్పటికి మాబాబాయికి అయిదేళ్లు. మా అమ్మే పెంచింది బాబాయిని. ఎంతో కాలానికి బయల్దేరిన పిల్లాడినవడంవల్ల, అందులో మొగనలుసునవడంవల్ల మా బాబాయికి నేనంటే ఎంతో ముద్దుగా ఉండేది.

పిల్లలంటే ప్రాణమిస్తాడు కాని పాపం ఆయనకు పిల్లలు లేరు. బాబాయి నన్ను పంపించమన్నాడు. అక్కడ ఉంటే నాచదువు పాడవదు. ఎందుకంటే మా ఊరు లాగా బాబాయిగారిది పల్లెకాదు. మా అమ్మ యిక్కడ ఉంటే బామ్మగారాబంవల్ల పాడైపోతున్నాననీ, బాబాయిదగ్గరయితే భయభక్తులతో బుద్ధిగా ఉంటాననీ పంపడానికి ఒప్పుకుంది. నన్ను వదలడం మా అమ్మకు కష్టమైనా మా బాబాయిమాట కాదనలేదు.

మాపిన్నికి నారాక ఎంతమాత్రం యిష్టంలేదు. ఆవిడ తన అన్నగారి కొడుకును పెంచుకోవాలనుకుంది. మాబాబాయి ఒప్పుకోలేదు. అసలు ఎవర్నీ పెంచుకోనన్నాడు. కాని రోజూ జరుగుతోన్న పోరు పడలేకపోయాడు. ఆవిడమాట వింటేకాని యింట్లో సుఖం ఉండదని గ్రహించి బావమరదికొడుకును పెంచుకోడానికి ఒప్పుకొన్నాడు. ఆమె అన్నగార్ని అడగడానికి పుట్టింటికి బయల్దేరింది. పిల్లాణ్ణి పంపడానికి వదినగారు ఒప్పుకోలేదు. మాపిన్నికి అభిమానం ఎక్కువ. పెంపివ్వననగానే ఆమెకు ఎక్కడలేని కోపం వచ్చింది. మర్నాడే పుట్టింటినించి వచ్చేసింది.

స్వతహాగా ఆమె చాలా మంచిమనిషి. పుట్టింటిమీద అభిమానం ఉండడం సహజం. తనవాళ్లు ఆస్తి అనుభవిస్తే ఆమెకు తృప్తి. కాని ఆమె అనుకున్నట్టు జరగలేదు. మాబాబాయి నన్నే పెంచుకుంటానని ఆమెను అన్నగారింటికి పంపకుండాఉంటే నిజంగా నన్ను బతకనిచ్చేది కాదు. కాని భర్త ఒప్పుకున్నాక వదినగారు కాదనడం ఆవిడకు అవమానమనిపించింది. తనమాట అన్నగారు కాదనడనే ధీమాతో నన్ను పెంచుకోడానికి వీల్లేదని నానాహంగామా చేసి, తీరా వెళ్లి అడిగితే వాళ్లు కాదంటే మరి ఆవిడకు కష్టమనిపించదూ! తన భర్త అడగగానే కాదనకుండా ఆయన వదినగారు పంపేసింది. ఆమాత్రం తనవదినగారు చేయలేకపోయింది. కననంతమాత్రాన బిడ్డల్ని పెంచడం చాతకాదూ! కావాలని తెచ్చిపెట్టుకున్నాక వాళ్లను కష్టపెట్టుందా! మా పిన్నికి తన పుట్టిల్లంటేనే అసహ్యం వేసింది. అన్నగారిమీద మనసు విరిగింది.

అప్పట్నించీ నన్ను మాపిన్ని కన్నకొడుకులాగ చూసింది. వాళ్లింట్లో ఉన్నకాలమే నాజీవితంలో సుఖంగా గడపిన దినాలు. రోజూ బాబాయితోపాటు నాకు ఫలహారం, కాఫీ. మాఅమ్మ అయితే ఇంత ఆనకాయ వేసి చద్దన్నం పెట్టేది. మా పిన్ని ఉద్దేశంలో అవన్నీ పల్లెటూరి అలవాట్లు, పల్లెటూరి పద్ధతులు. నన్ను నవీనపద్ధతిలో పట్నవాసపుకొరని చేయాలని మాపిన్నిఉద్దేశం. బాబాయి ఆఫీసుకి

వెళ్తోంటే ఆయనబండిలో నన్ను బడికి పంపించేది. అక్కడ రాజభోగం అనుభవించా ననుకోండి. అలాగ పదేళ్లు గడిచాయి.

నేను బి. ఏ. చదువుతున్నాను. మా ఎదురింటివారమ్మాయి ఉమ నాక్లాసు. చాలా చురుకైన పిల్ల. బాగా చదివేది. మా బాబాయీ, ఉమతండ్రీ ప్రాణస్నేహితులు. చిన్నప్పట్నించీ ఒకే చోట ఆడుకుంటూ అన్నదమ్ములకన్నా ఎక్కువగా ఉండేవారు. మాబాబాయితోపాటు నేనూ వాళ్లింటికి వెళ్ళేవాడిని. అప్పుడప్పుడు ఉమతో మాట్లాడడం తటస్థించేది. మాటలు గాఢమైత్రిగా మారింది. ప్రథమంలో మాయిద్దరి మధ్యా ఉన్న స్నేహం చివరికి ప్రేమగా మారింది. ఉమఅమ్మమ్మ ఈసంగతి గ్రహించింది. ఎలాగైనా ముసలివాళ్ళు ఆవులిస్తే ప్రేగులు లెఖ్ఖపెట్టగలరు. ఒకరోజున ఆమె మాయింటికి వచ్చింది. ఉమకూడా వచ్చింది. మాటలసందర్భంలో ఆమె 'ఊరికే చెప్పులరిగేలాగ తిరిగి చివరికి ఏగొట్టంలోనో దిగకుండా ఉమను బాబుకిద్దామని ఉంది శ్యామలాంబా! ఈడూ జోడూగా ఉంటారు. పిల్లాడు కష్టపెట్టాడేమోనని బాధపడక్కర్లేదు. నువ్వు యోగ్యురాలివి. చిన్నప్పట్నించీ ఎరుగుదున్నాను. ఆమాత్రం గ్రహించలేనూ! నీకళ్లముందర పుట్టి మీయింట్లోనే ఎగిరి గంతులేసిన ఉమను నువ్వసలు కష్టపెట్టవుకదా! అత్తారింటి కెళ్లినా ఎదురుగుమ్మమేకనక పిల్ల కళ్లకు అగుపడ్తూనే ఉంటుంది. అన్నివిధాలా బాగుంటుందమ్మా. ఏమంటావ్? సలుగురం కలసి ఆలోచించి తథాస్తు అంటిమా-" అంది.

"బామ్మగారిలా అన్నారని ఆయన నొచ్చాక చెప్తా" అంది మాపిన్ని నవ్వుతో.

గదిలో ఉండి ఈమాటలు వింటూన్న నాకు ఏదో అయినట్టనిపించింది. అదోవిధమైన సంతోషం వచ్చింది. ఉమ ఎలా ఉందో చూద్దామని పనిఉన్నట్టు యివతలకు వచ్చాను. ఉమ నన్ను చూసింది. ఆమె [illegible] సిగ్గుతో ఎఱ్ఱబడింది. నాలో విద్యుత్తు ప్రవహించినట్టయింది. ఆలోచించుకుంటూ లోపలికి వచ్చేశాను.

మా పిన్ని చెప్పింది కామాల్ను మా బాబాయి నాన్నకు ఉత్తరం రాశాడు. మర్నాడు నన్నురమ్మని మానాన్న మనిషిచేత కబురంపాడు. నేను వెళ్లాను.

అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. నేను పుట్టాక పోయా డని చెప్పానే—ఆ మేనమామకు ఒక కూతురుంది. మాఅత్తయ్య నా కిచ్చి పెళ్లిచెయ్యాలనుకుందిట ఆ అమ్మాయిని. ఇంట్లో అందరూ ఒప్పుకున్నారు. నాకు తెలియబరచడానికి కబురంపాడు మానాన్న. నే నింతకుముం దెప్పుడూ ఆ అమ్మాయిని చూడలేదు. ఇదే మొదటిసారి చూడ్డం. ఆ అమ్మాయి పేరు లక్ష్మి.

లక్ష్మి పుష్టిగా ఉంటుంది. చామనచాయ. తీరైన ముక్కు. పెద్ద కళ్లు. పెద్ద జుట్టు. చదువు లేదు. హార్మోనియం ఏడాదినించి నేర్చుకుంటోంది. మొహంలో అమాయకత్వం ఉట్టిపడుతూ ఉంటుంది.

ఉమతో పరిచయం లేకపోతే లక్ష్మిని చేసుకునేవాడినే. ఉమ లక్ష్మికన్నా బాగుంటుంది. సన్నగా, పచ్చగా బంగారుతీగలాగ ఉంటుంది ఉమ. నాకందమంటే పెద్ద లెఖ్ఖలేదు. చదువు లేదని లక్ష్మిని పెళ్లాడకపోవడం లేదు. తెలివి ముఖ్యంగాని చదువెందుకు? లక్ష్మిని పెళ్లాడితే ఉమకు ద్రోహం చేసినవాడి నవుతానని బాధపడ్డాను.

మా యింటికి వచ్చాక యింట్లో అందరూ 'మీఆయనకు మంచినీళ్లు కావాలిట, తేవే లక్ష్మీ' అని లక్ష్మిచేత యిప్పించేవారు నాకు. అందరూ దాని మొగుణ్ణని అంటూంటే నాకు ముళ్లమీద నిల్చున్నట్టుండేది. ఆమె నన్ను భర్తగా భావించి ఎంతో గౌరవించేది. నేను వచ్చేటప్పటికి కూర్చున్నదల్లా గబుక్కున లేచి నిల్చునేది. నేను తిన్నతర్వాత నా కంచంలో తినేది. నాకు ఏంచెయ్యాలో తోచలేదు. లక్ష్మిని చూస్తే జాలేసేది. ఎంత అమాయికహృదయం! ఎంత నిష్కల్మష ప్రేమ! [illegible] [illegible]

అందరూ భార్యాభర్తలక్రింద జమకట్టేశారు. పల్లెటూరివారు పిల్లల్ని అలా తయారుచేస్తారు కాబోలు ఎప్పుడేనా ఒక్కతే ఉన్నప్పుడు పనుండి నేను గది లోకి వెళ్తే లక్ష్మి సిగ్గుతో తలవంచుకొని లేచి నిలబడేది! నాకు వెర్రెత్తినట్టయింది. యింక చెప్పక పోతే లాభం లేదనుకున్నాను.

ఒక రోజున లక్ష్మి తల దువ్వుకొంటోంది ఎవరూ లేరు. ఇదే సమయం అనుకొని 'లక్ష్మి, నీతో మాట్లాడాలి. ఇలా రా' అన్నాను.

ఆమె ఖంగారుపడింది. అటూ యిటూ చూసింది ఎవరేనా చూస్తున్నారేమో నని. తర్వాత హడావిడిగా 'ఇప్పుడు కాదు. ఎవరేనా చూస్తే బాగుండదు. భోజనా లయాక తోటలోకి రండి. అక్కడి కెవరూ రారు.' అంది. ఆమెమొహం లజ్జతో కందింది.

అనుకున్నప్రకారం యిద్దరం తోటలో కలిశాం. చెప్దా మనుకున్న విషయం ఎలా మొదలెట్టాలో తెలియక తికమకపడ్డాను. ఆఖరుకు ఎలాగో చెప్పాను. లక్ష్మి వెక్కి వెక్కి ఏడుస్తుం దనుకున్నాను. కాని ఏడవలేదు. ఏమైనా అంటుందేమో, ఆమెబాధ ఎలాగ మాడగల ననుకున్నాను. కాని అలాటి దేమీ జరగలేదు. ఏదేనా అంటే ఆమెను చేసుకుందా మనుకున్నాను. ఎందుకోగాని ఆమెహృదయం గాయపరచడం నా కెంతమాత్రం యిష్టంలేదు.

లక్ష్మి అంతా విన్నాక మెదలకుండా కూర్చుంది. మొహం పరకాయించి చూశాను. నా కేవిధమైన భావమూ ఆమెమొహంలో గోచరించ లేదు.

'కోపమొచ్చిందా లక్ష్మీ' అన్నాను చేతి గాజులు సర్దుతూ.

'కోప మెందుకు' అని నవ్వింది. చాలా తమాషాగా నవ్వింది. ఆ నవ్వెన్నటికీ మరచిపోలేను. ఆమెను వివాహమాడితే ఎంతో సుఖపడతా ననుకున్నాను. ఆమెను ముద్దెట్టుకోవా లనిపించింది. పెళ్లాడ డాని కిష్టపడని నా కిది ఉచితమేనా! మొదట వారించినా, తర్వాత అంగీకరించింది. కాని నేను చేస్తోన్న అన్యాయం—ఈ అన్యాయానికి నే నెంత వరకు బాధ్యుణ్ణి? ఆ అమాయకహృదయం ఎంత బాధ పడ్తుంది? రాత్రంతా ఈ ఆలోచనలతో గడిపాను.

మర్నాడే యింటిదగ్గర్నించీ బయల్దేరాను. వచ్చేసేప్పుడు మా నాన్నతో చెప్దా మనుకున్నాను. చెప్దామని ఎంతో ప్రయత్నించాను. కాని నోరు పెగల్లేదు. నేను వట్టి పిరికివాణ్ణని నాకు అప్పుడు తెలిసింది. నేను చెప్పకపోయినా ఈ పెళ్లి జరగదని నాకు తెలుసు. ఎందుకంటే నాకంటే లక్ష్మి ధైర్యం కలది. మనస్థైర్యం కలది. ఆమె తప్పకుండా చెప్పి పెళ్లి మాన్పిస్తుంది.

నేను బయల్దేరేరోజున లక్ష్మికి కొద్దిగా జ్వరం వచ్చింది. ఆరోజున లక్ష్మి అన్నం తినలేదు.

'వెళ్తున్నాను లక్ష్మీ' అని చెప్పాను. ఎవరూ లేకుండా చూసి కాళ్లకు దణ్ణం పెట్టి వెళ్లిపోయింది. ఆమె బాధపడ్తోందని గ్రహించాను. వెళ్లిపోయేటప్పుడు లక్ష్మికళ్లల్లో నీరు తిరిగింది. నాకు ఏడుపు వచ్చింది. రత్నాన్ని చేజేతులా జారవిడుస్తున్నా ననిపించింది. ఏదో పెద్ద పొరబాటు చేసినవాడిలాగ బాధపడ్డాను.

'లక్ష్మీ' అని పిలిచాను. లక్ష్మి వచ్చింది. 'ఏడుస్తున్నావా'! అన్నాను గాద్గదికస్వరంతో. నా కంఠంలోనే ఆగిపోయింది ఏడుపు. పూడుకుపోయి మాట రాలేదు. ఆమెతల నిమిరాను. 'నే నింక బతకను బావా' అంది ఏడుస్తూ. 'ఛీ ఏం మాట లవి' అన్నాను. లక్ష్మిమొహం చూస్తే ఏదో తీరని అపచారం చేశా ననిపించింది. ఏమైనాసరే లక్ష్మినే పెళ్లాడుదా మనిపించింది. ఉమకు ఈ మాత్రం సంబంధం రాకపోదు. నేను చేసుకోకపోతే లక్ష్మి విచారంతో గుండెపగిలి చచ్చిపోతుం దనుకున్నాను. 'నేను చెప్పిందంతా అబద్ధం లక్ష్మీ' అన్నాను.

'నిజంగానా' అంది లక్ష్మి ఆశ్చర్యంగా—కళ్లు పెద్దవిచేసి.

'నిజమే' అన్నాను నీరసంగా నవ్వుతూ.

'అయితే ఫర్వాలేదు. బ్రతుకుతాను. నామీద ఒట్టేట్టుకు చెప్పండి. నిజమేనా' అంది.

'ని-జ-మే' అన్నా తడబడుతూ. లక్ష్మి నిట్టూర్చి లోపలికి వెళ్ళి పోయింది.

వారంరోజులతర్వాత వెంటనే రమ్మని మానాన్న పాలేరుచేత కబురంపాడు. నేను తక్షణం బయల్దేరాను. పాలేరు దారిలో చెప్పాడు లక్ష్మికి జ్వరం ఎక్కువగా ఉందని. నా మనస్సు మనస్సులాగ లేదు. పరిపరివిధాల ఆలోచిస్తున్నాను.

ఇల్లు చేరగానే సరాసరి లక్ష్మిగదిలోకి వెళ్ళాను. లక్ష్మికి స్పృహ లేదు. మా నాన్నను పిలచి రహస్యంగా అడిగాను 'డాక్టరుగా రేమన్నా' రని.

నాన్న కళ్ళు తుడుచుకుని 'దాని కేర సేం బాగా లేదు. ఎప్పుడూ నిన్ను గురించే పలవరింతలు. దానిలో అన్ని ఊహా లున్నా యనుకోలేదు. ఇవాళ మరీ మిరి పోయాయి పలవరింతలు. డాక్టరు 'మెదడు ఎక్కువ పనిచేసింది. మనశ్శాంతి లేక వచ్చిం' దన్నాడు. నువ్వేమేనా అన్నావా?' అన్నాడు.

'అబ్బే! నే నేం అనలే' దన్నా.

'లక్ష్మి 'చదువుండాలమ్మ. చదువుకున్న వాళ్ళకు చదువుకున్న పెళ్ళా లుంటే బాగుంటుంది. నా కెందుకు చెప్పించలేదు?' అంటే నువ్వు చదువుకో మన్నా వేమో ననుకున్నాను' అన్నాడు నాన్న.

'నే నేం అనలేదు నాన్నా'. అని గదిలోకి వెళ్ళిపోయాను. చదువు తక్కువని చేసుకోదలుచుకోలే దనుకుంది లక్ష్మి! అత్తయ్య నన్ను చూసి కంటినీరు తుడుచుకుంది.

'లక్ష్మీ' అని పిలిచాను, అతికష్టంతో కళ్ళు విప్పింది. ఆయాసంగా 'వచ్చావా! వస్తా వను కున్నా.' అంది.

మాఅత్తయ్య లోపలికి వెళ్ళింది. లక్ష్మికి ఉడుకులాంపట్టీ వేశాను. అరచేయి ముద్దెట్టుకో బోయాను. చెయ్యి లాక్కుని—

'వద్దు. జ్వరంవాళ్ళను ముద్దెట్టుకుంటే జ్వరం వస్తుంది' అంది.

'ఫరవాలేదులే' అని చెయ్యి ముద్దెట్టుకున్నాను.

'నేనంటే నీ కెంత అభిమానం' అంది. నాకు ఏడుపు వచ్చింది. కళ్ళల్లో నీరు చూసి—

'ఏడుస్తున్నావా! మొగాళ్ళు ఏడవచ్చా. ఛీ! ఊరుకో బావా, నేను బతుకుతాను!' అంది.

ఆరోజల్లా లక్ష్మి తేలికగానే ఉంది. ఎన్నో కబుర్లు చెప్పింది. పరాకుమాట లాడడం లేదు.

'బావా, నువ్వు చెప్పింది నిజమే. కాదని అబద్ధ మాడావు, ఔనా' అని అడిగింది.

'కాదు. అబద్ధం చెప్పలేదు. నిజమే చెప్పాను'. అన్నా.

'కాదు. నే నేం అనుకోనులే. అసలు నేను పల్లెటూరి దాన్ని. చదువుకున్న దాన్ని పెళ్ళాడితేనే బాగుంటుంది. నా కేం తెలియదు' అంది.

'అక్కర్లేదు. ఇన్ని తెలివితేట లున్నప్పుడు చదువు లేకపోతేయేం? చదువుకున్న వాళ్ళకన్నా చాకలి మెరుగుట. నిన్నే పెళ్ళాడుతాను' అన్నాను. అది నవ్వింది. నేనూ నవ్వాను. ఆరోజంతా దానితో కబుర్లు చెప్పాను.

'బావా, కాసేపు పడుకో' అంది.

'నాకు నిద్ర రావడంలే' దన్నాను.

'నిద్ర పోకపోతే జబ్బు చేస్తుంది. అదీకాక పొద్దున్నే లేవాలి. వెళ్ళు, నామాట విను' అంది.

ఆ గదిలోనే యింకోమంచంమీద పడుకుని నిద్రపోయాను. నిద్ర లేచేటప్పటికి లక్ష్మి నిశ్చలంగా పడుకునిఉంది. ఆనిద్రనుండి యింక మెలకువ లేదు.

నా కిది గట్టిదెబ్బ. దాని చావుకు నేనే కారణం. నామనస్సు చాలా సంక్షోభించింది. ఈదెబ్బనుండి ఎప్పటికీ తేరుకోలేను నేను, పుస్తకం ముట్టడం మానే శాను. ఏపని చేస్తోన్నా లక్ష్మి జ్ఞాపకంవచ్చేది. కళ్ళ ఎదుట ఉన్నట్టుంది నాకు.

పరీక్షలు దగ్గరికి వచ్చాయి. ఏం చదవలేదు.

ఫేలవుతా ననుకున్నాను. థర్డుక్లాసు వచ్చింది. థర్డు క్లాసు బి. ఏ. కు ఏం ఉద్యోగం యిస్తారు! చెప్పాను కదూ నష్టజాతకుణ్ణని. యింకా చదువుదామంటే బుర్ర చదువుమీదికి పోదు. మానాన్నకు సాయంచేద్దామని వచ్చేశాను. పిల్ల నిస్తామని చాలామంది వచ్చారు. ఎనిమిదివేలిస్తా మన్నారు. నాన్నగారు పిల్లని చూడ్డానికి రమ్మన్నారు. కిక్కురుమనకుండా బయల్దేరాను.

ఆ అమ్మాయి థర్డుఫారం చదివింది. ఫిడేలు వచ్చును. తెల్లగా పొడుగ్గా సన్నగా ఉంది.

ఇంటికి వచ్చాక మా నాన్న 'ఏమంటావురా' అన్నాడు.

'నేను చేసుకోను.'

'ఏం ? బంగారపుబొమ్మలాగున్న ఆ పిల్ల నచ్చలేదా నీకు! యింకా చదువుకున్న పిల్ల కావాలా!'

నేను మాట్లాడకుండా గదిలోకి వెళ్లడానికి రెండడుగులు వేశాను.

'ఒక్క నిమిషం ఆగు. నామాటలు నాలుగూ విని పోదువుగాని. నాకు వాళ్లు ఎనిమిదివేలిస్తున్నారు కనక చేసుకోవాలని లేదు. పిల్ల లక్షణంగా ఉందని చేసుకోమన్నా'

'అది కాదు నాన్నా—'

'నాకు తెలుసు నీఉద్దేశం. బాబాయి రాశాడు. కాని నా కాసంబంధం యిష్టంలేదు. మేనరికం ఉంది కదా అనుకుంటే దానికి భూమ్మీద నూకలు లేకపోయాయి. ఈపిల్లను చేసుకో. నామాట విను.'

నేను ఆముదం త్రాగినవాడిలా మొహం పెట్టాను.

'నీకు ఈసంబంధంకన్నా అది యిష్టమని ఎరుగుదును. కాని ఏం చెయ్యను? అది చేసుకోడానికి వీల్లేదు. నీకు చెప్పకుండానే నామాట వింటావనుకున్నాను. సరే చెప్తా విను.

మానాన్న కాళహస్తిలో ఉన్నప్పుడు ఒక యిల్లు కొన్నారు. ఆయింట్లో నలుగురు మొగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు పోయారు. మాఅమ్మకూడా అక్కడే పోయింది. మానాన్న తర్వాత వివాహమాడలేదు. మా మేనత్తకూతురు వెధవామె ఒకతె మా యింట్లో ఉండేది.

ఆమె గర్భవతి అయింది. రహస్యంగా పురుడోసుకుని చచ్చిపోయింది. పిల్లవాడిని వృద్ధిలోకి తెస్తానని నాన్న ఆమె దగ్గర ప్రమాణంచేశాడు. దొరసానితో ఎవరేనా బ్రాహ్మలకి పెంపియ్యమని చెప్పాడు.

కేశవరావుగారు, అంటే ఉమతాతకు పిల్లలు లేరు. ఆయన దొరసానికి తెలిసినవాడు. పిల్లవాడు గౌరవకుటుంబీకుడనీ, బ్రాహ్మణకులజుడనీ చెప్పి పెంచుకోమని సలహా చెప్పింది. కేశవరావుగారు పిల్లాడిని పెంచుకున్నారు. కాళహస్తినించీ పిల్లాడితో యిక్కడికి వచ్చేశారు. అతని కూతురే ఉమ. అంటే మీరిద్దరూ అన్నాచెల్లెళ్లవుతారు. మా నాన్న పోయేముందు చెప్పాడీరహస్యం. తెలియక వియ్యమొందుతామేమో' నని చెప్పాడాయన.

నేను కరుడుకట్టి స్తబ్ధులాగ ఉండిపోయాను. నాలో మిగిలిన ఆశ ఒకటీ ఆరిపోయింది. ఇంతవరకూ నే ననుకున్నట్టు ఏదీ జరగలేదు. జీవితంలో ఏవిధమైన ఆశ లేకుండా, ఆనందించదగ్గ విషయం లేకుండా అడవిలో చెట్టులా బతికున్నాను. ఈ నా జీవితానికి అంతమనేది ఉంటుందా?